ఈవిధంగా విద్యార్థికి ప్రోత్సాహాన్ని అంద జేసే, అతని వ్యక్తిగత జీవితంపై గూడా తన ప్రభావాన్ని వ్యాపింప జేయగల వస్తువు (Element) యేదీ మన విద్యాలయాల్లో కనుపించదు. ఒకయంత్రంలోనివిడిభాగాలవలె, నిశ్చిత కాలంలో, నిశ్చిత స్థలంలో, నిశ్చిత విద్యార్థులకు, నిశ్చిత మయిన ఉపాధ్యాయుడు, నిశ్చిత పాఠ్యభాగాన్ని (బోర్డు - తెల్ల సుద్దల సహాయంతో) బోధించి పోతాడు. ఈ విద్యాదాన ప్రదానాల్లో "జీవం" లేదు.

"మనం పాశ్చాత్య దేశాల్లోవలనే-సరిగా అలాగే-కుర్చీలు, బల్లలు, పీరియడ్లు మొదలైన వన్నీ యేర్పరచుకొన్నాం. అందువల్ల మన విద్యావిధానం పాశ్చాత్యుల విద్యా విధానం లాంటిదేనని మురిసిపోవడం పొరబాటు. బాహ్యంగా పాశ్చాత్య విద్యాలయాలను రవంతయినా తప్పిదం లేకుండా మనం అనుకరించాం. కాని ఆ విధానంలోని "ఆత్మ"ను మంచి గుణాలను మనం ఏర్పరచుకోలేక పోయాం. వారి విద్య సంఘ జీవిత శిక్షణలో ఒక భాగం. సంఘ జీవితంలో వారు నిర్వర్తించవలసిన ధర్మాలు, వారు విద్యాలయాల్లో పొందే శిక్షణ-ఈ రెండూ మిళితమై ఏ విధమైన వైరుధ్యమూ లేకుండా ఉంటాయి. కాని మన "యాంత్రిక" విద్యా విధానం అలాంటిది కాదు." అని రవీంద్రుడు ఏవిద్యా విధానాన్ని గూర్చి మూడు దశాబ్దాల క్రితం వాపోయాడో, ఆ విద్యా విధానమే నేడూ నిలిచి ఉంది. ఈ పై వివరించిన పరిస్థితికి అపవాద రూపంగా కొన్ని ప్రశంసనీయమైన విద్యాలయాలు, ప్రతి విద్యాలయంలోను కొందరు అధ్యాపకులు లేక పోలేదు. ముఖ్యంగా అలాంటి ఉపాధ్యాయుల్ని వివేచనగల విద్యార్థి అనుదినం ప్రీతితో భక్తితో స్మరించుకొంటూంటాడు.

ఈ విధమయిన మన విద్యాలయాల శోచనీయ దశకు ఉపాధ్యాయవర్గం బాధ్యులనుకోవడం అవివేకం. మొత్తం దేశమందలి ప్రజల జీవిత పరిస్థితులు, వాటి ఫలస్వరూపాలైన భావాలు - ఇవే కారణం. విరివిగా సరియైన విద్య వ్యాపించినపుడుగాని ప్రజల మానసిక భావాలయందు, తద్వారా జీవన విధానాల్లో అభ్యుదయం కలుగదు. కాబట్టి ప్రతి విద్యావంతుడు గూడా తన విద్యను విజ్ఞానరూపంలో తన నిత్య జీవితంలో ఉపయోగించుకోవడం, మంచి విధానాలను ఆచరణలోకి తీసుకురావడం నేడు అత్యావశ్యకమైన విషయాలు. కాని ఇలాంటి విద్యావంతుల్ని తయారు జేయవలసింది మరల ఆ విద్యాలయాలే! ఇలా ఇది "అన్యోన్యాశ్రయదోషం" పరిణమించింది నేడు. మన దేశంలో దృఢనిశ్చయంతో, ఒకఉన్నతకార్యక్రమాన్ని అమలు జరుపటానికి ప్రభుత్వం పూనుకొన్నప్పుడే ఈ సమస్య పరిష్కారం కావడం.

# "ఏది నీతి? ఏది నేతి?"

మా. సు. చక్రవర్తి

బంగారుకు ఒళ్ళంతా మొద్దుబారిపోయినట్టయింది. మెదడు సరిగా పనిచెయ్యడం లేదేమో ననిపించింది, జరిగినదంతా నిజమేనా? ఒక్కనిముషం సేపటిలో డబ్బంతా పోయినట్టే! వెనక్కు తిరిగి చూచాడు. ఆ గుంపులో నుండి ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. ఇంత సేపూ ప్రేక్షకులుగా మాత్రమే గుంపులో ఉన్న వారిలో కొందరు బంగారువైపు సానుభూతితో చూస్తూ వెళ్లారు. వాళ్ల చూపులనుండి మొహం తప్పించుకొని తను మామూలు మనిషినే అన్నట్టు, తనపై అంత సానుభూతి చూపించ నవసరం లేదన్నట్టు సూచనగా ముందుకు నడిచి పోతున్నాడు బంగారు. ఒకరిద్దరు దగ్గిరికి వచ్చి 'అక్కడెందుకు ఇరుక్కున్నావు? ఏమాత్రం పోయిందే'మన్నారు. వాళ్ళను చీదరించుకొని వదిలించుకుంటే బాగుండదు. తను జూదరినని నిశ్చితమైపోతుంది. శ్రమ పూర్తిగా వదలని ముఖంలోకి లేని నవ్వును తెచ్చుకోడానికి ప్రయత్నించి '...అఁ!...ఇరుక్కోవడం పొరపాటే. అయితే బాదేంపోలేదు లెండి. మొదట వచ్చిన అయిదురూపాయలు పోయినాయి. అంతటితో ఆగింది. ఇంకా అక్కడ ఉంటే ఏమయ్యేదో'నని

గంభీరంగా బొంకాడు. మాటలైతే అన్నాడు కాని ముఖంలో పేలవం పోలేదింకా. వాళ్ళు సందేహంతోనే 'అహాఁ! పోనీలే' అంటూ వెళ్ళారు.

ఇంకొక్కసారి వెనక్కి చూశాడు. అక్కడ ఎవ్వరూ లేరు.

* * *

'సైకిలు ఇచ్చేశావ్రా.'

'డబ్బిచ్చాడా?'

'ఆ. ఆఁ. ఇదుగో వందరూపాయలు.'

రాముడు వందరూపాయలు బంగారు దగ్గర నుంచి తీసుకొని లెక్కపెట్టుకున్నాడు.

'సరిపోయిందా.'

'ఆఁ.'

'నే వస్తానైతే,'

'ఆఁ. పాపం నాకోసరం శ్రమపడి సహాయం చేశావు.'

'ఇదీ పెద్దసహాయమేనా. బాగుంది. పోతాను మరి.'

'ఊఁ. వెళ్ళిరా.'

రాముడు, బంగారు ఇద్దరూ కార్ఖానాలో పనివాళ్ళు. బీదవాళ్లే. మామూలుగా బీదవాళ్లందరికీ వచ్చే అవసరాలు కాకుండా రాముడికి ఏదో ప్రత్యేకావసరం వచ్చి డబ్బుకోసరం తంటాలు పడ్డాడు. ఇంక విధిలేక తన సైకిలు అమ్మకానికి నిశ్చయించి బంగారుతో ఆమాటన్నాడు. బంగారు సరే చూద్దామని కొన్నిచోట్ల విచారించి ఒక బేరం కుదిర్చాడు.

బేరాలు విచారించడానికి తలపెట్టినప్పుడు సైకిలు అమ్మి రాముడికి సహాయం చేయడమే మనస్సులో ఉంది బంగారుకు. కాని ఈ బేరం కుదిరేటప్పుడు తను కూడా కొంత లాభపడడానికి వీలుంటుందేమోనని ఉన్నట్టుండి తోచింది. తగినవిధంగా బేరం సాగించి, రాముడికి ఒక నూరు రూపాయలు ముట్టేటట్టు, ఒక పాతిక రూపాయలు తనకు మిగిలేటట్టు చూసుకున్నాడు.

తన పాతికరూపాయలతో ఇంటికి బయలుదేరాడు బంగారు. అనుకోనంత సులభంగా తనకు కాస్త పైసంపాదన లభించినందుకు సంతోషపడ్డాడు. ఇట్లా తను పాతికరూపాయలు తీసుకోవడం రాముడిని మోసం చేసినట్లయిందేమోనని కొంచెం నొచ్చుకున్నాడు. కాని రాముడు తనకు వందరూపాయల కంటె ఎక్కువ వస్తుందని అనుకోలేదు గదా అని తన్ను తాను సమర్థించుకున్నాడు. తొలికాన్పుకు పెళ్ళాం పుట్టింటికి వెళ్ళింది. కిందటి నెలలో కూడా ఆమెకేమీ పంపించడానికి లేకపోయింది. ఈ సారి తను పంపదలచుకున్న పదిహేనుతో బాటు ఈ పాతిక కూడా పంపిస్తే బాగుంటుంది. రేపే పంపించవచ్చుననుకుంటూ ఇంటిదారి పట్టిన బంగారుకు దారిలో జూదరుల గుంపు తటస్థపడడం, డబ్బంతా పోవడం, జరిగింది.

* * *

బంగారు అసలు మంచివాడు. విపరీతపు కష్టాలలో పెరిగి కట్టుబాట్ల నడతకు అలవాటు పడినవాడు. తన అల్పసంపాదనతో కుటుంబ పోషణ సవ్యంగా చేసుకుంటున్నవాడు. వృథా వ్యయం కలిగించే అలవాట్లు లేవు. అటువంటి వాడు ఈ జూదంలో పడడం, డబ్బు పోగొట్టుకోవడం, అతనికే అర్థం కాలేదు.

మెదడు మెల్లిగా యథాస్థితికి వస్తూంది. ఎన్నెన్నో ఆలోచనలు స్ఫురిస్తున్నాయి. విపరీతంగా తన్ను తాను నిందించుకుంటున్నాడు. అప్పుడప్పుడు సమర్థించుకోవడానికి ప్రయత్నించి విఫలుడౌతున్నాడు. చివరకు దుఃఖంతో ఇల్లు చేరుకున్నాడు.

'ఇంటికిరావడం ఆలస్యమైందేం నాయనా' అనడిగింది తల్లి. సైకిలు బేరంవల్ల ఆలస్యమైందన్నాడు. కష్టంమీద తన మనోవేదన తల్లికి తెలియనివ్వలేదు. తిందామనిపించకున్నా, సహించకున్నా సందేహం కలగనివ్వకుండడానికై మామూలుగా భోంచేసి వాకిటి అరుగుమీదికి వచ్చి పండుకున్నాడు.

ఇందాకటి సంగతి మరపుకు వచ్చేటట్లు లేదు. ఇదివరకెన్నిసార్లు తను జూదరుల గుంపులు చూడలేదు! ఈ దుర్బుద్ధి ఈవేళ ఎందుకు పుట్టింది? చేతులో డబ్బుందనా? జీతాలిచ్చిన రోజుల్లో ఎప్పుడూ జూదమాడుదామనిపించలేదే! ఈ వేళ తనతో కూడా తనెరిగినవాళ్ళెవరూ లేరనా? ఔనేమో! అసలు ఈ జూదపు బుద్ధి తనలో తనకు తెలియకుండా ఉందేమో. ఇన్నాళ్లు ఎరిగిన వాళ్లు ఏమనుకుంటారని భయపడడం

వల్లనో, సరైన అవకాశం లేనందువల్లనో తను జూదమాడలేదేమో. ఈసారి అవకాశం రాగానే మళ్ళీ ఇదే పని చేస్తాడేమో! ఏమో!

అబ్బో! మళ్ళీ ఇంకోసారా ఛీ! అంత చెడ్డవాడు కాడే తను. అసలు ఆ వేళ అనుకోకుండా ఆ పాతిక రూపాయలు రావటంవల్లనే తన కా బుద్ధి పుట్టింది. ఈ సైకిలు బేరం ఎందుకు వచ్చింది. రాముడు సైకిలు అమ్మి పెట్టమని తన నెందుకు అడిగాడు. వాడి కింకెవరూ దొరకలేదా... ఛీ! ఆదేంమాట. అమ్మి పెట్టి సహాయం చెయ్యమనడం వాడి తప్పా. సైకిలు అమ్మకానికి సహాయపడమన్నాడు కాని అందులో తనను లాభం సంపాదించమని వాడనలేదే... ఏదో, అనుకోకుండానే తనకు ఒక పాతిక రూపాయలు గిట్టాయి. డబ్బు సులభంగా వచ్చినంతమాత్రాన జూదమాడి పారేసుకోమన్నారా? ఆ పాతిక రూపాయలు తను సవ్యంగా ఖర్చుపెట్టే అవసరాలు లేవా? అంత నిగ్రహం లేకుండా పోయిందేం తనకు! పెళ్ళానికి డబ్బు పంపించవద్దూ. కిందటినెల తెచ్చిన అప్పు తీర్చుకోగూడదూ. అనుకున్నంతకంటె కాస్త ఎక్కువగా పంపిస్తే పెళ్ళాం సంతోషించదూ! పోనీ, తల్లికింకో చీర కొనివ్వకూడదూ. అధమపక్షం తనకైనా కొన్ని కొత్త గుడ్డలు కొనుక్కోలేదూ! అబ్బా! ఎంత పాడుపని చేశాడు తను!

పెళ్ళాన్ని తలచుకుంటే గుండె చివుక్కుమంటూ ఉంది. కాపురంచేసిన ఈ కొన్నాళ్ళల్లోను తన మొగుడంటే ఎంతటివాడో ననుకుంది.

తల్లికి తెలిస్తే దుఃఖిస్తుందా, తిడుతుందా, తనకొడుకు కింతటి వెధవైనాడని బాధ పడుతుందా? ఇన్నాళ్ళు తను పెరిగిన పద్ధతికి, తను గడిపిన జీవితానికి ఏవిధంగానూ అతకని దుర్మార్గపు పని తనెందుకు చేశాడో!

జూదం ఎంత సులభమనిపించింది! జూదరులందరికీ అదే అనిపిస్తుందేమో ... వాడు ఒక పట్టీని రెండుగా మడిచి దానిని వంకర వంకరగా చుట్టి నేలమీద పెట్టాడు. మడతలో సరిగా పుల్ల పెట్టగలిగితే ఒడ్డినదానికి రెట్టింపుపందెం మిస్తానన్నాడు. సులభంగా లేదూ! మడత బాగా కనబడుతుంది కదూ? ఉన్నవాళ్ళంతా తలా అణా, బేడా ఒడ్డి సులభంగా రెట్టింపు గెలుస్తున్నారు. తనూ పందెం ఒడ్డాడు. గెలిచాడు. పందాలు ఎక్కువ చేశారు. కొందరు గెలిచారు కొందరు పోగొట్టుకున్నారు. తను రూపాయ ఒడ్డాడు. రెండు రూపాయలు వచ్చాయి. మెల్లిగా ఐదురూపాయలు వచ్చాయి. అంతటితో తను వచ్చేయవలసింది. బాగుండును. వచ్చేయకూడదూ? వెధవ బుద్ధి. ఇంకోడెవడో పది ఒడ్డి ఇరవై గెలిచాడు తనూ ఒడ్డాడు. పోయింది. ఇంకోడు అయిదు పెట్టి పది సంపాదించాడు. ఈసారి నష్టంకూడా తీసుకుందామని అయిదురూపాయలు పందెం ఒడ్డి జాగ్రత్తగా చూచి మడతలో పుల్ల పెట్టాడు. గెలిచాడని పించింది. ఏదీ చుట్ట విప్పితే పుల్ల మడతలో లేదు. పందెం పోయింది. ఇక అంతా తీవరం కావడానికి కెంతో సేపు పట్టలేదు. నిముషంలో ముగిసిపోయింది.

న్యాయమార్గాన కష్టపడి సంపాదించిన సొమ్మే గట్టిసొమ్మని, తక్కినది దక్కదని అంటారు. ఈ పాతిక రూపాయలు అందుకనే తనకు దక్కలేదేమో. అయినా ఇది అన్యాయార్జితమా? తనెవరిని అన్యాయం చేశాడు? దొంగతనం చెయ్యలేదే. ఎవరికీ నొప్పికలిగించి సంపాదించలేదే... కాదుగాని, నిజంగా ఇది మోసపు సొమ్మేమో! సైకిలు అమ్మగా వచ్చిన డబ్బంతా రాముడికివ్వకుండా తను పాతిక తీసుకోవచ్చునా? రాముడు వందకంటె ఎక్కువ వస్తుందనుకోక పోవచ్చు. ఎక్కువ వచ్చిందిగా, వచ్చినప్పుడు అతనికి ఇవ్వనవసరం లేదూ? పోనీ తను పాతిక తీసుకుంటున్నానని అతనికి చెప్పనైనా లేదే. అవును. మోసమే. మోసంచేసినందుకు కావలసిందే తనకు శాస్తి. ఇదికూడా మోసపుపనేనా? ఈమాదిరి చిన్న చిన్న బేరాలు చేసి కొంచెం సంపాదించుకోవడం తప్పా. ఎంతమంది చెయ్యడం లేదు ఈ పని. వాళ్ళందరి డబ్బూ ఈ విధంగానే పోతుందా. పెద్దపెద్ద మోసాలు చేసి బాగున్నవాళ్లు లేరూ? పీడించి డబ్బు సంపాదించుకొని బాగున్నవాళ్ళు లేరూ?

బంగారుకు అంతకంతకు ఆలోచనలు, తర్కం తెగడంలేదు. తన నిద్రలో నుండి తను తప్పించుకోలేక పోతున్నాడు. ఇక రాత్రికి నిద్రపడుతుందా అబ్బా అనిపించిందతనికి.